క్లుప్తంగా

తుమ్మలకుంట సర్వే



సర్దార్‌నగర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

తుక్కుగూడ: సర్దార్‌నగర్ రెవెన్యూ పరిధిలోని వెంచర్‌ను బుధవారం విజిలెన్స్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సందర్శించి సర్వే చేశారు. రియల్టర్లు ఈవెంచర్‌లో తుమ్మలకుంట చెరువును పూడ్చి వేశారని లోకయుక్తలో కేసు నడుస్తుంది. ఇటీవల ఆయా పార్టీల నేతలు, స్థానిక రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అధికారులు సర్వే చేపట్టారు. ఈ వెంచర్ స్థలంలో గతంలో చెరువు ఉందా? కుంట ఉందా ? అలుగు ఉండేదా ? వంటి పలు రకాల అంశాలపై సర్వే చేశారు. తాము సేకరించిన పూర్తి వివరాలను లోకయుక్తకు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈఈ దుద్యానాయక్, మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, టీపీఓ వెంకట రఘునాథ్, ఆర్ఐ స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో నూతనంగా నిర్మించిన లలిత శివ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో 108 హోమ గుండాలలో హోమాలు చేశారు. అనంతరం శ్రీగణపతి, సుబ్రహ్మణ్య, శివ, నంది, లలిత త్రిపురసుందరీ, ఆంజనేయ, నాగ, శిఖర, నవగ్రహ విగ్రహాలు, యంత్రాల ప్రతిష్ఠతో పాటు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ చేపట్టారు. ఈ వేడుకకు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ఆర్, తీగల కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, పీసీసీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి తదితరులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు జి.లక్ష్మి నర్సింహారెడ్డి, వి.ఈశ్వర్‌గౌడ్, జి.గోపాల్‌రెడ్డి, పి.భిక్షపతి, జి.అమరేందర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, ఎస్.శ్రీరాములు, నర్సింహా, ఎస్.వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కడ్తాల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి గోపాల్ అన్నారు. బుధవారం మండల పరిధి రావిచేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి కొనుగోలుకు రూ.11 వేలను ఉపాధ్యాయులకు ఆయన అందజేశారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని, విద్యార్థులు క్రీడా సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగయ్య, నాయకులు బీరప్ప, శ్రీశైలం, కృష్ణయ్య, యాదయ్య, సాయికుమార్, హెచ్ఎం స్వరూప, పీడీ సాబేర్ ఉపాధ్యాయులు అశోక్, సతీశ్, రమేశ్, మంజుల, వినోద్, శ్రీదేవి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్త

యాచారం: గుర్తు తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఊరికి వెళ్లేటప్పుడు చోరీలు జరగకుండా పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ కూడలి, మొండిగౌరెల్లి చౌరస్తా తదితర కూడళ్లల్లో పోలీస్ సిబ్బంది సైకిల్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గంజాయి తాగడం, విచ్చలవిడిగా మద్యం సేవించడం, మహిళలను ఇబ్బంది పెట్టే సంఘటనలు జరిగితే ఫిర్యాదు చేస్తే, వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కనకదుర్గకు ప్రత్యేక పూజలు

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం కనకదుర్గ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సంఘ సేవకుడు పగడాల ముత్తు దర్శించుకుని, పగడాల కనకయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయానికి కలశం సమర్పించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములుగౌడ్, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, నాయకులు వెంకటయ్యగౌడ్, మహేందర్‌గౌడ్, ఆంజనేయులు గౌడ్, జగన్, యాదిరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.



పార్కులోకి వెళ్లే దారి



ఆకట్టుకుంటున్న నిర్మాణాలు

పచ్చదనం.. పరిమళించే!

- నగరానికి కూతవేటు దూరంలో 'సంజీవని'
- 20 కిలో మీటర్ల వైశాల్యంలో ఏర్పాటు
- సెలవురోజుల్లో ఆటవిడుపు కోసం కిక్కిరిసిపోతున్న జనం
- గుర్రంగూడలో వనం ప్రత్యేకత

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో ఔటర్‌రింగ్‌రోడ్డుకు చేరువలో హైవేపై గుర్రంగూడ ఫారెస్ట్‌ను అత్యాధునికంగా ఆహ్లాదాన్ని పంచే విధంగా ఫారెస్ట్ అధికారులు సంజీవని వనాన్ని తీర్చిదిద్దారు. 20 ఎకరాల విస్తీర్ణంలో టూరిస్ట్ ప్రదేశంగా అభివృద్ధి చేశారు. నగరం నడిబొడ్డున విస్తరించి ఉన్న ఈ అడవిని పచ్చని వనంగా మార్పు చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దారు. సుమారు 4కిలో మీటర్ల మేర చక్కని వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేశారు. దీంతో గుర్రంగూడ, బీఎన్‌రెడ్డి, వనస్థలిపురం యాంజాల్, హస్తినాపురం తదితర కాలనీలకు చెందిన వారు ప్రతిరోజు వందల మంది వాకింగ్ కోసం ఇక్కడికి వస్తుంటారు. కాంక్రీట్ జంగిల్‌లో విసిగిపోయిన కాలనీవాసులు ఇక్కడికి వచ్చి కిట్టీ పార్టీలు చేసుకుంటారు. కార్తీక వనభోజనాలు సైతం ఇక్కడే నిర్వహిస్తున్నారు. చక్కటి ఆహ్లాదాన్ని కోరుకునేవారు సెలవు రోజుల్లో కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి ఇక్కడకు చేరుకుంటారు. నీడనిచ్చే పెద్ద పెద్ద గుబురు చెట్లు, చిన్న కోనేరు, ఎటు చూసినా పచ్చని గార్డెనింగ్, రకరకాల పూల మొక్కలు, చిన్నపాటి ఔషధమొక్కలు, చల్లని మంచినీరు ఏర్పాటు చేశారు. సెలవులు వచ్చాయంటే చాలు సంజీవని వనం కిక్కిరిసిపోతుంది. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఇక్కడికే ఫీల్డ్ ట్రిప్‌కు తీసుకొస్తుంటారు. పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10గా టికెట్లు తీసుకుంటారు. వెహికిల్ పార్కింగ్ కూడా ఏర్పాటు చేశారు. కాలనీ అసోసియేషన్ మీటింగ్‌లు, కిట్టి పార్టీలు, చిన్నపాటి పండుగలు చేసుకోవడానికి ప్రత్యేక ఓపెన్ షెడ్డును ఏర్పాటు చేశారు. సంజీవని వనంలో అడుగుపెడితే చాలు సాయంకాలం వరకు అక్కడే గడిపేయొచ్చని పర్యాటకులు చెబుతున్నారు. ఇక్కడికి వచ్చేవారు ఎవరి ఆహార పదార్థాలను వారే తెచ్చుకుంటారు. ఈ విషయంలో నిర్వాహకుల నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదు. పార్కును శుభ్రంగా ఉంచుకునేందుకు అడుగడుగునా డస్ట్ బిన్స్ బాక్సులను ఏర్పాటు చేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

అతివకు అండగా వార్తకు స్పందన

సాక్షి ఎఫెక్ట్..

కందుకూరు: 'అతివకు అండగా మీతో తోడుగా సాక్షి' పేరుతో సాక్షి పత్రికలో ప్రచురితమైన వార్తకు మహిళల నుంచి విశేష స్పందన వస్తుంది. ఆ వార్తలో మహిళల సమస్యలను నేరుగా నిరభ్యంతరంగా చెప్పుకునేలా వాట్సప్ నంబర్ ఇవ్వడంతో ప్రభుత్వ అధికారులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో సాక్షిలో ప్రచురితమైన వార్త క్లిప్పింగ్‌ను ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో అందరికీ తెలిసేలా కార్యాలయం గోడకు అతికించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళల భద్రత గురించి సాక్షి చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించారు. మండల వ్యాప్తంగా డ్వాక్రా గ్రూప్‌ల ద్వారా అందరికీ తెలిసేలా వాట్సప్ నెంబర్ పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సులోచన, ఎంపీఓ గీతా, సీనియర్ అసిస్టెంట్ పద్మ, జూనియర్ అసిస్టెంట్ మహాలక్ష్మి, సిబ్బంది అంజయ్య, అజయ్ పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం గోడకు క్లిప్పింగ్‌ను అతికిస్తున్న సిబ్బంది

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

పహాడీషరీఫ్: మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీ సిబ్బందికి బుధవారం కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ సాబియా అఫ్రోజ్, మేఘనారెడ్డిలు 106 మంది సిబ్బందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచేందుకు వారి ఆరోగ్యాలను పణంగా పెట్టాల్సి వస్తుందన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్లా సాది, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, శంషూద్దీన్, ఫమిదా అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



ప్రాజెక్ట్ శిక్షణలో అంగన్‌వాడీ టీచర్లు

మానవ అక్రమ రవాణా నేరం

మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరమని మేయర్ పారిజాత పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా నిర్మూలించడం అందరి బాధ్యత అని మేయర్ తెలిపారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సమావేశం హాల్లో రెండు రోజుల పాటు ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, మహిళా శిశు సంక్షేమ శాఖ హయత్‌నగర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. బుధవారం ముగింపు రోజున బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి హాజరై మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరమన్నారు. నిత్యం ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అమాయకులను అక్రమ రవాణా చేసి సొమ్ముచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అందరూ కలిసి అడ్డుకోవాలని సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ 28 సంవత్సరాలనుంచి లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పని చేస్తూ 28,600 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ అధికారులు విజయభాస్కర్, శ్రీకాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానకుమారి, సురేష్‌కుమార్, అనీల్, మితాలీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజహితానికి విశ్వహిందూ పరిషత్

పరిషత్ విభాగ్ సంఘటన సాయిరామ్

కందుకూరు: సమాజహితానికి విశ్వహిందూ పరిషత్ పనిచేస్తుందని విశ్వహిందూ పరిషత్ విభాగ్ సంఘటన మంత్రి వెలుగు సాయిరామ్ అన్నారు. వీహెచ్‌పీ స్థాపించి 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని సీతారామశాస్త్రి ఫంక్షన్‌హాల్లో మంగళవారం రాత్రి షష్టి పూర్తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1964లో శ్రీకృష్ణజన్మాష్టమిన ముంబాయి సమీపంలోని సాందీపని ఆశ్రమంలో విశ్వహిందూ పరిషత్‌ను స్థాపించారన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ శ్రీగురూజీ స్థాపించిన తమ సంఘం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందన్నారు. చరిత్రలో నిలిచిపోయే అయోధ్య వంటి భారీ ఉద్యమాలు చేపట్టి విజయం సాధించిందన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలు, కులాలు, వర్గాలకు అతీతంగా ప్రతి హిందువు విశ్వహిందూ పరిషత్‌ను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల ప్రఖండ అధ్యక్షుడు ఎగ్గిడి అనిల్‌కుమార్, మండల కార్యదర్శి మాదరమోని సురేష్, విభాగ్ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కౌకుంట్ల శ్రీనివాస్, కార్యదర్శి మండల రాజు, కోశాధికారి కర్రె నరసింహా, భజరంగ్‌దళ్ జిల్లా సహ కన్వీనర్ మండల ఈశ్వర్, జిల్లా ధర్మప్రసార ప్రముఖ్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అతిథులకు జ్ఞాపికలను అందిస్తున్న నిర్వాహకులు

విద్యార్థులపై దృష్టి సారించాలి

- భోజనంలో నాణ్యత పాటించాలి
- మండల ప్రత్యేక అధికారి ముత్యాలు

తలకొండపల్లి: ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక దృష్టిని సారించి, వెనుకబడిన వారిని ఏ గ్రేడ్‌కు వచ్చే విధంగా తీర్చి దిద్దాలని మండల ప్రత్యేక అధికారి ముత్యాలు అన్నారు. నాణ్యతతో కూడిన విద్యను అందించి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలే చూడాలని సూచించారు. మండల కేంద్రం కేజీబీవీ పాఠశాలను ఎంపీడీఓ శ్రీకాంత్‌తో కలిసి ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతంతో పాటు, భోజన ఇతర వసతులను పరిశీలించారు. అనంతరం ముత్యాలు మాట్లాడారు. పది పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని చిన్నారులకు సూచించారు. భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని, తాజా కూరగాయలతో వంటకాలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

చదువుతోనే భవిష్యత్తు



టై, బెల్టులు అందజేస్తున్న వెంకట నర్సప్ప

ఇబ్రహీంపట్నం రూరల్: చదువుకుంటేనే భవిష్యత్తు అని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్ప అన్నారు. పట్నం మండలం ఎల్మినేడు గ్రామంలో విద్యార్థులకు దాతల సహకారంతో ఉచిత బస్ పాసులు, టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్కారు బడుల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా విద్యార్థులకు సహాయ సహకారాలు అందజేస్తున్నారని చెప్పారు. వీటిని చిన్నారులు వినియోగించుకుని మంచిగా చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఆయన అభినందించారు.

దారి ఇలా.. వెళ్లేది ఎలా?

తలకొండపల్లి: మండల పరిధి తుమ్మలకుంట తండా–దేవుని పడకల్ గేట్ సమీపంలోని సింగిల్ బీటీ రోడ్డు అధ్వాన్నంగా మారింది. వరుస వర్షాలకు బీటీ కొట్టుకుపోయి.. రోడ్డంతా గుంతలు ఏర్పడి, వాటిల్లో నీరు నిలిచింది. దీంతో ఈ మార్గం గుండా వాహనాలపై కాదుకదా.. కనీసం కాలి నడకన వెళ్లలేని దుస్థితి ఉందని ప్రాంత ప్రజలు తెలిపారు. కల్వర్టు కూడా కూలిపోయిందని పేర్కొన్నారు. కడ్తాల్–కల్వకుర్తి ప్రధాన రహదారి కావడంతో ఈ దారిలో నిత్యం వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయన్నారు. సెలవు దినాల్లో కడ్తాల్ మండలంలోని మైసిగండి మైసమ్మను దర్శించుకోవడానికి పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారని వెల్లడించారు. గతంలో ఈ ప్రాంతంలో డబుల్ రోడ్డుకు ప్రతిపాదన ఉన్నప్పటికీ.. అటవీ భూమి కావడంతో ఆ శాఖ అధికారులు అభ్యంతరం చెప్పడంతో ఆగిపోయిందని వివరించారు. సుమారు కిలో మీటర్‌కు పైగా ఉన్న ఈ రోడ్డు మొత్తం గుంతల మయంగా ఉందని, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించడంతో పాటు.. కల్వర్టును నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రాంతీయులు కోరుతున్నారు.



తుమ్మలకుంట తండా-దేవుని పడకల్ గేట్ రోడ్డు దుస్థితి

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ప్రారంభం

కడ్తాల్: సత్యసాయి మందిరంలో శ్రీ లలితా పరమేశ్వరి యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్త్రీశక్తి లలితాంబిక బృందం, సాయి మందిర దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో.. దేవాలయ ప్రవేశం, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షబంధనం, దీక్షాధారణ, శోడశ స్తంభ పూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, కలశ స్థాపన, అర్చన, హారతి, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నమాచార్య సంకీర్తనాచార్యులు, రాష్ట్రపతి సాహిత్య పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో అన్నమాచార్య సంకీర్తన ఘనంగా జరిగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, నిర్వాహకులు ఎలికంటి జ్ఞాన ప్రసూనాంబ శర్మ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, భజన మండలి సభ్యుడు వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, నారాయణ, రాఘవాచారి, శ్రీనివాస్, లలితాంబిక బృందం సభ్యులు పాల్గొన్నారు.



అన్నమాచార్య సంకీర్తనలో భక్తులు, నాయకులు

రెండేళ్లుగా ఎదురు చూపులే

- 'అసంపూర్తిగా' ఆరోగ్య ఉప కేంద్రం
- రూ.21.50 లక్షలు వెచ్చించినా.. పూర్తికాని వైనం!

మంచాల: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పే పాలకులు.. ఆచరణలో అమలు చేయలేక పోతున్నారు. మంచాల మండల పరిధి లోయపల్లిలో రెండేళ్ల క్రితం ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణ పనులు మొదలు పెట్టినా.. నేటికీ కొనసాగుతూనే ఉంది. మండలంలో మంచాల, ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆరుట్ల పీహెచ్‌సీ పరిధిలో రంగాపూర్, బోడకొండ, బండలేమూర్, చెన్నారెడ్డి గూడ, లోయపల్లి సబ్ సెంటర్లు ఉన్నాయి. ఐదు సబ్ సెంటర్లలో బోడకొండ, రంగాపూర్, లోయపల్లి సబ్ సెంటర్లకు ప్రత్యేకంగా భవనాలు మంజూరు అయ్యాయి. వాటిలో రంగాపూర్ సబ్ సెంటర్‌కు ప్రత్యేక భవన సదుపాయం కల్పించారు. బోడకొండలో సబ్ సెంటర్ నిర్మాణం పూర్తయింది.

అద్దె ఇంట్లో ఆరోగ్య కేంద్రం

లోయపల్లిలో 2022 ఫిబ్రవరిలో విడతలుగా రూ.21.50 లక్షలు వెచ్చించి ఆరోగ్య ఉప కేంద్రం పనులు ప్రారంభించా నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. మొదటి విడతగా మెడికల్ డిపార్ట్‌మెంట్ నిధుల నుంచి రూ.16లక్షలు మంజూరు అయ్యాయి. నిర్మాణ పనులు గోడల వరకు పూర్తి అయింది. అసంపూర్తిగా ఉండడంతో.. ఎండీఎస్ నిధులు రూ.5.50లక్షలు మంజూరయ్యాయి. అయినా నిర్మాణం పూర్తి కాలేదు. ఈ సబ్ సెంటర్ నిర్వహణ కోసం ప్రభుత్వం పల్లె దవాఖానలో భాగంగా అనిఫా అనే వైద్యురాలిని నియమించింది. భవనం పూర్తి కాక పోవడంతో ఆమె అద్దె ఇంట్లో కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు, పాలకులు స్పందించి ఆరోగ్య ఉప కేంద్రం భవనం పనులు పూర్తిచేయించి, వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయంపై పంచాయతీ రాజ్ డీఈఈ అబ్బాస్‌ను వివరణ కోరగా.. అప్పట్లో బిల్లులు ఆలస్యం కావడంతోనే పనులు నిలిచిపోయాయని, త్వరలోనే పూర్తి చేయిస్తామని తెలిపారు.



లోయపల్లి ఆరోగ్య ఉప కేంద్రం

రెండేళ్లు కావస్తుంది...



లోయపల్లి గ్రామంలో సబ్ సెంటర్ నిర్మాణ పనులు ప్రారంభించి రెండేళ్లు అయింది. రెండు విడతలుగా నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడం వలనే పనులు ఆగిపోయినట్లు తెలుస్తోంది. అధికారులు, పాలకులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేయించి, వినియోగంలోకి తేవాలి.

– బొట్టు ప్రవీణ్ నాయక్, లోయపల్లి

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

తలకొండపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే.. ఎలాంటి వ్యాధులు సోకవని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధి వెంకట్రావ్‌పేట్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. డాక్టర్ అఖిల్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సంయుక్తంగా 236 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడారు. వికారం, నీళ్ల విరేచనాలు, కీళ్ల నొప్పులు, నీరసం, దగ్గు, గొంతు నొప్పి, కళ్ల మంటలు, ముక్కు కారడం, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా.. వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు హైమావతి, రమేష్, ఈశ్వర్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి, రఘురాములు, వెంకట్‌రెడ్డి, మైసయ్య, గౌడ సంఘం కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, రాజు, దశరథం, లాల్, భాస్కర్, రాము, అంజయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.